క్లుప్తంగా

తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులు పరిశీలిస్తున్న ఎస్సై

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో, గొర్రెగట్టు వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'ఉప్పొంగిన వాగులు,నదులు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. స్పందించిన ఎస్సై సురేష్, స్థానిక సర్పంచ్ తోట స్రవంతి, అశోక్ సహకారంతో తాత్కాలిక రోడ్డుకు మరమ్మతు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బెల్లంపల్లి: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ డీఈ స్వామిరెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని పెర్కపల్లి, దుగ్నెపల్లి, గురిజాల, ఆకెనపల్లి గ్రామాలకు మంజూరైన నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల పనులను పరిశీలించి పనుల వివరాలను ఆరా తీశారు. దీంతో పాటు పెర్కపల్లిలో పల్లె ప్రకృతి వనంను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. డీఈఈ వెంట మండల పంచాయతీ రాజ్ఏఈ పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి: 2023–24విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం కోసం ఆగస్టు 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వరలక్ష్మి, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14సంవత్సరాలు నిండిన వారు ఓపెన్ టెన్త్‌కు, టెన్త్ పాసైన వారు ఓపెన్ ఇంటర్‌కు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం:8309769067లో సంప్రదించవచ్చన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

నెన్నెల: నెన్నెల, వేమనపల్లి మండలాల్లోని మారుమూల ప్రాంతాలైన కోణంపేట, బోగంపల్లి, దమ్మిరెడ్డిపేట, బొప్పారం, వేమనపల్లి చామనపల్లి, బద్దంపల్లి, బొమ్మెన నాగారాం గ్రామాల నుంచి వంద మంది యువకులు, ప్రజలు మంగళవారం కలెక్టరేట్ వరకు పాక్షిక పాదయాత్ర చేపడుతున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ రెండు మండలాల్లోని గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణా వసతుల గురించి కలెక్టర్‌కు సమస్యలను విన్నవించుకోనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో మారుమూల గ్రామాల ప్రజలు, యువకులు పాల్గొని విజ యవంతం చేయాలని పేర్కొన్నారు.

ఆలయంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయాలను మాజీ ఫిలిం డెవలప్‌మెంట్ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందించారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహాయ సాకారాలు అందిస్తానని చెప్పారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కొట్టె సత్తయ్యకి ప్రమాదం జరిగి, జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, తెలంగాణ రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరి రామ్మోహన్‌రావు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళి, జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేశ్ యాదవ్, నాయకులు తిరుపతి, సత్తన్న, శంకర్ పాల్గొన్నారు.

'గడపగడపకూ బీఆర్ఎస్'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలో సోమవారం 'గడపగడపకూ బీఆర్ఎస్' ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, లబ్ధిపొందిన వారితో ముచ్చటిస్తూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెత్తకు చోటెక్కడ..?

- డంప్‌యార్డు ఏర్పాటుకు స్థల సమస్య
- మూడుసార్లు ఒకచోట నుంచి మరోచోటుకు తరలింపు
- తాజాగా గోల్‌బంగ్లా బస్తీ పక్కన గుర్తించినట్లు ప్రచారం
- జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

బెల్లంపల్లి:మున్సిపాలిటీలో డంప్‌యార్డు ఏర్పాటు సమస్యగా మారింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాటు చేసిన డంప్‌యార్డును ఎత్తివేసిన తర్వాత మరోచోట ఏర్పాటు చేయడంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. జన నివాసాలకు చేరువలో డంప్‌యార్డును ప్రతిపాదిస్తుండటంతో పురప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీగా అవతరించి మూడు దశాబ్దాల కాలం గడిచిపోయినా డంప్‌యార్డు సమస్య తీరలేదు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన బుదాకలాన్ సర్వే నెంబర్ 170లో రెవెన్యూ శాఖ అప్పగించిన 10ఎకరాల ప్రభుత్వ భూమిలో డంప్‌యార్డును నిర్వహించారు. ఆ స్థలం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌పరిధిలోకి వెళ్లడంతో అక్కడి నుంచి డంప్ యార్డును ఎత్తివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతాన్ని ఎంపిక చేయకపోవడంతో ఎత్తివేసిన డంప్‌యార్డులోనే మొన్నటి వరకు చెత్తాచెదారం పడేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో మంట రగిలి, దట్టమైన పొగ వ్యాపించి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విసుగుచెందిన స్థానికులు చెత్త ట్రాలీలు, ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళన చేయడంతో అనివార్యంగా డంప్‌యార్డును తాజాగా ఎత్తివేశారు.

శాంతిఖని బస్తీ వాసులు వ్యతిరేకించడంతో..

ప్రత్యామ్నాయంగా శాంతిఖని–65 డీప్ బస్తీల చేరువలో డంప్‌యార్డును ప్రతిపాదించారు. ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 5లో 10ఎకరాల భూమిని డంప్‌యార్డు కోసం రెవెన్యూ శాఖ కేటాయించింది. కానీ ఆ ప్రాంతంలో డంప్‌యార్డు వద్దని ఆయా బస్తీల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేసి ఆందోళన బాట పట్టడంతో అక్కడ కూడా డంప్‌యార్డు ఏర్పాటు కాలేకపోయింది. దీంతో అనువైన ప్రాంతాన్ని గుర్తించకుండా మున్సిపల్ అధికారులు తీవ్రంగా తర్జన భర్జనపడుతున్నారు.

దూరంగా ఏర్పాటు చేయాలి



డంప్‌యార్డు అంటేనే చెత్తా చెదారం. కుప్పలు తెప్పలుగా చెత్తను ఓ చోట డంప్ చేయడం వల్ల సహజంగానే దుర్వాసన వస్తుంది. నిప్పంటిస్తే కలుషితమైన పొగ వచ్చి ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. పాత డంప్‌యార్డు చెత్తకు నిప్పంటించడంతో రోజుల తరబడి పొగ వ్యాపించి ఇబ్బంది పడ్డాం. ఏ ప్రాంతమైనా ఫర్వాలేదు కానీ, జన నివాసాలకు దగ్గరగా డంప్‌యార్డును ప్రతిపాదించి ఏర్పాటు చేయకపోవడం మంచిది.

– జనార్దన్, స్థానికుడు

సరైన చోటును గుర్తించాలి



డంప్‌యార్డు కోసం ఇప్పటికే రెండు మూడు ప్రాంతాల్లో సర్వే చేశారు. కానీ ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ఖరారు చేయలేకపోయారు. మున్సిపాలిటీకి నలువైపులా ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ బస్తీలు ఉన్నాయి. అందువల్ల ప్రజలు డంప్‌యార్డు తమ ప్రాంతం చేరువలో వద్దని వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారు.

– సతీష్‌కుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్

ఈ క్రమంలో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను చెత్త ట్రాలీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించి కొద్దిరోజుల పాటు గురిజాలకు వెళ్లేరోడ్డు ఐటీడీఏ ఉద్యానవనం ఎదుట, పక్కనా డంప్ చేసి వెళ్లారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ విద్యాసంస్థలు ఉండటంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా చెత్త డంప్ చేయడాన్ని మానుకుని మరో ప్రాంతం వైపు దృష్టి సారించారు.

తాజాగా గోల్ బంగ్లా బస్తీ పక్కన..!

డంప్‌యార్డు సమస్య జఠిలంగా మారడంతో క్రిస్టియన్ శ్మశాన వాటిక వెనకాల గోల్‌బంగ్లా బస్తీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని డంప్‌యార్డుకు అనువైనదిగా గుర్తించినట్లుగా ప్రచారం జరుగుతోంది. అధికారికంగా ఇంకా ఆ స్థలాన్ని రెవెన్యూ శాఖ అప్పగించకపోయినా, మున్సిపల్ అధికారులు మాత్రం ఆ స్థలంపైనే ఆశలు పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. శ్మశానవాటికను ఆనుకుని డంప్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల గోల్ బంగ్లా బస్తీ, బెల్లంపల్లి బస్తీవాసులతో పాటు అటు నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీ వాసులకు సైతం ఇబ్బందికర సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా, డంప్‌యార్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ఆసక్తి కరంగా మారింది.

24 గంటల విద్యుత్ ఘనత బీఆర్ఎస్‌దే

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి: వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. 24గంటల విద్యుత్‌పై పార్టీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లాలన్న మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు, దండేపల్లి మండలం ముత్యంపేట రైతువేదిక వద్ద సోమవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్‌ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, స్థానిక సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేష్, రైతుసమితి కో ఆర్డినేటర్లు, సభ్యులు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సింగరేణి బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.29వేల కోట్లు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–5 గనిపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో, సంస్థ ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో బ్యాంకుల చుట్టూ తిరిగి, అప్పులు చేసి, వేతనాలు చెల్లించాల్సి వస్తుందని ఆరోపించారు. గతేడాది సంస్థకు వచ్చిన లాభాల్లో వాటా 35శాతం, 11వ వేజ్‌బోర్డ్ వేజెస్, దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్‌లు దసరాకు ముందే చెల్లించాలన్నారు. ఆయన వెంట ఆ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రాజేశం, మల్లయ్య, తిరుపతి, సంపత్ తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

అంతర్గతరోడ్డు బురదమయం



భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీల్లో రోడ్లు బురదమయం కావడంతో, ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, దళితులు అధిక జనాభా కలిగిన కొత్తపల్లిలో సీసీరోడ్లు నిర్మించలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని తాత్కాలికంగా మొరం వేయించి, రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సతీష్‌రెడ్డి, ఎంపీవో
ఫోన్ నంబర్ : 9848384636

పేరుకుపోయిన చెత్త..!



భీమిని: పారిశుధ్య కార్మికులు 12రోజులుగా సమ్మెలో ఉండటంతో గ్రామంలో ఎక్కడి చెత్త, అక్కడే పేరుకుపోతుంది. భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాల ఎదుట చెత్తాచెదారం పేరుకుపోయి, అపరిశుభ్రంగా తయారైంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్తను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నీరు ఇలా.. వెళ్లేదెలా..!

నెన్నెల: మండల కేంద్రంలోని దుబ్బపల్లి(ఎస్) ప్రాథమిక పాఠశాల ప్రాంగణం ఓ బురదమడిని తలపిస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా పాఠశాల ముఖద్వార ఆవరణ అంతా నీరు నిలుస్తోంది. విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నీటి కోసం పాట్లు పడాల్సిందే..!



దండేపల్లి: మండల కేంద్రంలోని తెనుగువాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణల్లో చిన్నపాటి వర్షానికే వరద నీళ్లు నిలుస్తున్నాయి. పాఠశాల ఆవరణలోనే చేతి పంపు ఉండగా, నీళ్లు నిలిచి ఉండటంతో తాగునీటికి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించాలి.

అధ్వానంగా రోడ్డు

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో ప్రయాణించాలంటే అటు రోగులు, గర్భిణులతో పాటు ఇటు వైద్య సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. భారీ గుంతలు ఏర్పడి నీళ్లు నిల్వడంతో, ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర చికిత్స సమయంలో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.



అన్నదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల అమావాస్య సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇరుకుల రాదమ్మ, రాజయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

లక్సెట్టిపేట: మండలంలోని పాత కొమ్ముగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ ధనిశెట్టి కొమురయ్య, వార్డు మెంబర్లు ధనిశెట్టి తిరుపతి, గూడ వేణు, మోటపలుకుల భాగ్యలక్ష్మితో పాటు ముఖ్య నాయకులు ధనిశెట్టి భూమక్క, పెట్టం సాగర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సుమారు 50మంది పార్టీలో చేరగా వీరికి మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన

భీమిని: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ భీమిని, కన్నెపల్లి మండలాల్లో సోమవారం పారిశుధ్య కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. కన్నెపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేయగా, భీమినిలో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు స్వామి, నరేష్, రమేష్, మహేష్, రాజ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిలబడి కార్మికుల నిరసన

బెల్లంపల్లి(తాండూరు): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాండూరు మండల గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఎంపీపీ కార్యాలయం ఎదుట చేపట్టిన కార్మికుల సమ్మెకు పంచాయతీ కార్యదర్శులు మద్దతు తెలిపారు.

కార్మికులకు కాంగ్రెస్ మద్దతు...

దండేపల్లి: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు డిమాండ్ చేశారు. దండేపల్లిలో రిలే దీక్ష చేస్తున్న జీపీ కార్మికులకు సోమవారం మద్దతు తెలిపారు. దండేపల్లి మండలంలోని వెల్గనూర్‌లో మృతి చెందిన కాంద్రపు రాజయ్య, తిప్పని రాయలింగు, మెంగని రాజన్న కుటుంబ సభ్యులను, కొర్విచెల్మలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మల్లేష్ కుటుంబాన్ని, ఇటీవల మృతి చెందిన గట్టయ్య, సాయిరెడ్డి ప్రతాపరెడ్డి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెల్గనూర్‌కు చెందిన చుంచు గంగన్నను, అనారోగ్యంతో బాధపడుతున్న ద్వారకకు చెందిన రాస గంగన్నను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.


బెల్లంపల్లి(తాండూరు): ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు


దండేపల్లిలో మద్దతు తెలుపుతున్న ప్రేంసాగర్‌రావు


కన్నెపల్లిలో పారిశుధ్య కార్మికుల భిక్షాటన

లక్సెట్టిపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు 12రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు ఏఐసీసీ మెంబర్ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు పూర్తి మద్దతు తెలిపారు. గ్రామాలే అభివృద్ధికి పట్టు గొమ్మలని, గ్రామస్థాయిలో కార్మికులు సంతృప్తిగా ఉంటేనే ప్రజలందరూ బాగుంటారన్నారు. వేతనాలు పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, కౌన్సిలర్ రాందేని వెంకటేష్, పాయెల్ చిన్నయ్య, హాజీ, షఫీ కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి


మద్దతు తెలుపుతున్న మేకల దాసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ కార్మికులు(సఫాయిలు) దేవుళ్లతో సమానమని, అలాంటి వారిని పర్మినెంట్ చేసి 1వ కేటగిరీ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. సీఎం కేసీఆర్ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, కార్మికుల సమ్మెకు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. హాజీపూర్‌లో సమ్మె శిబిరాన్ని సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని కోరితే మల్టీపర్పస్ పేరుతో కార్మికులపై పనిభారాన్ని మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో కార్మిక పక్షాన నిలబడి అందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మద్దతు పలికిన వారిలో సీపీఐ హాజీపూర్ మండల కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా నాయకులు లింగం రవి, సారంగపాణి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ మద్దతు.. భోజన వసతి

పంచాయతీ కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కార్మిక సమ్మెకు మద్దతు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్మికులకు వంటా–వార్పు అవసరమైన వంట సామగ్రిని అందించారు. మద్దతు పలికిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, డీసీసీబీ వైస్ చైర్మన్ మాధవరపు రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజు ఉన్నారు.

చెన్నూర్ రోడ్లకు మహర్దశ

- అభివృద్ధి పనులకు రూ.53కోట్లు మంజూరు


చెన్నూర్‌లోని బురద రోడ్డు

చెన్నూర్: మున్సిపాలిటీ రోడ్లకు మహర్దశ పట్టనుంది. రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పూర్తి పనులను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సుమారు రూ.100కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తుండగా, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.53కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఇందులో రోడ్లకు రూ.40కోట్లు ఖర్చు చేస్తుండగా, మరో రూ.13కోట్లతో ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణాలు ఇలా..

చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వార్డుల్లో రోడ్ల నిర్మాణానికి మోక్షం వచ్చింది. అన్ని వార్డుల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో మున్సిపాలిటీ కార్యాలయం నుంచి బేతాళవాడ మీదుగా జాతీయ రహదారి వరకు బైరి సత్తెన్న ఇంటి నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల మీదుగా జాతీయ రహదారి వరకు మరో రోడ్డు. జాతీయ రహదారి నుంచి కస్తూర్బా కళాశాల వరకు. సత్యసాయి బాబా ఆలయం నుంచి కుమ్మరికుంట మీదుగా మహంకాళి వాడ వరకు. గాంధీచౌక్ నుంచి రాజీవ్ రోడ్డు మీదుగా నాయీబ్రాహ్మణ వీధి వరకు. శిరిడి సాయిబాబా ఆలయం నుంచి జెండవాడ వరకు, బైపాస్ లింక్ రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయించారు.

వాడవాడలా సీసీ రోడ్లు..

చెన్నూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రోడ్లు అధ్వానంగా ఉన్న వాడల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలతో బురద రోడ్లకు చెక్ పడనుంది. మున్సిపాలిటీలోని అంతర్గత రోడ్లకు పెద్ద ఎత్తున నిధులు మంజూరుకావడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సరుకులు పంపిణీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో వోలపు విష్ణు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందగా సోమవారం మాలమహానాడు నాయకులు వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి 50కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.